

మృణాల్ ఠాకూర్, నాని

## ఈ అక్షరాల వెనుక మర్మమేంటో..

'ఇది నా భర్తకు అంకితం ఇస్తున్నా.. చాలా ప్రత్యేకమైన పాట.. తను ఎప్పటిలాగే ఆలస్యంగా వస్తున్నారు.. పాట నా మాతృభాష తెలుగులో ఉంది' అంటూ మృణాళ్ ఠాకూర్ మాటలు వినిపిస్తున్నాయి. అంతర్లీనంగా ఏదో కథ చెపుతున్నట్టున్న ఈ మాటల వెనకే పాట మొదలవుతుంది. ఇది నాని 'హాయ్ నాన్న' సినిమాకు చెందిన మూడవ పాట. మృణాళ్‌ఠాకూర్ పాయింట్ ఆఫ్‌వ్యూలో మొదలయ్యే ఈ పాట కథకు చాలా కీలకమని దర్శకుడు శౌర్యువ్ అన్నారు. హీరో హీరోయిన్ల వైవాహిక జీవితానికి ఈ పాట అద్దం పడుతుందని, హేషమ్ అబ్దుల్ వహాబ్ అద్భుతమైన మెలోడీగా ఈ పాటను స్వరపరిచారని నిర్మాతలు మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల తెలిపారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, కాలభైరవ, శక్తిశ్రీ గోపాలన్ ఆలపించిన ఈ గీతం సినిమాకే హైలెట్ అని వారు చెప్పారు. బేబీ కియారా ఖన్నా కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్.



కాజల్ అగర్వాల్

## కాజల్ కొత్త అవతారం

పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకుడు. బాబీ తిక్క, శ్రీనివాస్ తక్కలపల్లి నిర్మాతలు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ని ఈనెల 11న మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ' తన కెరీర్‌లోనే విభిన్నమైన పాత్రను ఇందులో కాజల్ చేస్తున్నారు. సత్యభామగా కాజల్ కొత్త అవతారాన్ని ప్రేక్షకులు చూస్తారు. దాదాపు షూటింగ్ 60శాతం పూర్తయింది. ఇటీవలే హైదరాబాద్‌లో కాజల్ పాల్గొనగా కొన్ని కీలక సన్నివేశాలతో పాటు పోరాటాలను కూడా తెరకెక్కించాం. ఈ నెల రెండోవారం నుంచి కొత్త షెడ్యూల్ మొదలుకానుంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ప్రకాశ్‌రాజ్, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ సమర్పణలో రూపొందుతున్న చిత్రానికి ఆయనే స్క్రీన్‌ప్లే కూడా అందిస్తున్నారు. చిత్రానికి కెమెరా: జి.విష్ణు, సంగీతం: శ్రీచరణ్ పాకాల.



రీతూవర్మ, విక్రమ్

## కరిచే కళ్లే చూసి కుదేలయ్యానయ్యా..

చియాన్ విక్రమ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా 'ధృవనక్షత్రం'. రెండు భాగాలుగా ఈ చిత్రం రూపొందుతున్నది. గౌతమ్ వాసుదేవ మీనన్ దర్శకుడు. రీతువర్మ కథానాయిక. ఈ చిత్రం తొలి భాగం 'ధృవనక్షత్రం చాప్టర్ 1 యుద్ధ కాండ' ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హేరిస్ జయరాజ్ స్వరాలందించిన ఈ చిత్రంలోని తొలిపాటను శనివారం మేకర్స్ విడుదల చేశారు. 'కరిచే కళ్లే చూసి కుదేలయ్యానయ్యా.. గరుకు ఒళ్లే నన్ను లాగెనురా ' అని సాగే ఈ పాటను రాకేందుమౌళి రాయగా, శ్రీలేఖ పార్థసారథి ఆలపించారు. మాస్ అంశాలే కాకుండా, సంగీత పరంగా కూడా ఈ చిత్రం అద్భుతంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఆర్.పార్తీబన్, బేగ్, సతీష్ కృష్ణన్, మాయ ఎస్.కృష్ణన్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, ఎస్.ఆర్.కతీర్, విష్ణుదేవ్.



రాజు మురుగన్, కార్తి, అనూ ఇమ్మాన్యుయెల్, నాని, వంశీ పైడిపల్లి తదితరులు

## ఖైదీని మించేలా జపాన్ ఉంటుంది: కార్తి

'ఈగ' తర్వాత నేను తమిళనాడు వెళ్తే, అక్కడ చాలామంది మా తమిళబ్బాయిలాగే ఉన్నావయ్యా' అన్నారు. తమిళనాడు నుంచి వచ్చిన కార్తీ కూడా అంతే. ఇక్కడవాళ్లకు అచ్చం తెలుగబ్బాయిలా అనిపిస్తారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న కార్తీ 'జపాన్'తో షాకింగ్ గెటప్‌తో మనముందుకు వస్తున్నారు. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు హీరో నాని. కార్తీ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'జపాన్'. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. రాజు మురుగన్ దర్శకుడు. ఎస్.ఆర్.ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్ ప్రభు నిర్మాతలు. నవంబర్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో కార్తీ మాట్లాడుతూ ..జపాన్' కథ విన్నప్పుడే కథానుగుణంగా మారాలని ఫిక్సయ్యానని, ఇది తన మనసుకు దగ్గరైన కథ అని, వినోదంతోపాటు ఆలోచింపజేసే సినిమా ఇదని, తన 'ఖైదీ'చిత్రాన్ని మించేలా ఈ సినిమా ఉంటుదని చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్‌తో పాటు పైడివల్లి వంశీ తదితరులు కూడా పాల్గొన్నారు..






బన్నీ వాసు, సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల, అనిల్ విశ్వనాథ్, గౌరీ కృష్ణ

## అంచనాలు నిజమయ్యాయి

'మా ఊరి పొలిమేర-2' చిత్రానికి అన్ని కేంద్రాల్లో చక్కటి ఆదరణ లభిస్తున్నది. ఈ సినిమా విషయంలో మా అంచనాలన్నీ నిజమయ్యాయి' అన్నారు నిర్మాత గౌరికృష్ణ. ఆయన నిర్మాణంలో సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల జంటగా డా|| అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. శనివారం థాంక్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ విజయం తమ కష్టాన్ని మరచిపోయేలా చేసిందని వంశీ నందిపాటి అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ కథలోని సస్పెన్స్, అనూహ్య మలుపులు ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేస్తున్నాయని చెప్పారు. టీమ్ అందరి సమిష్టి కృషి వల్ల ఈ విజయం సాధ్యమైందని సత్యం రాజేష్ తెలిపారు.











